క్లుప్తంగా

ఏపీ మోడల్‌లో ప్రవేశానికి దరఖాస్తులు

బనగానపల్లె రూరల్: పట్టణంలోని రవ్వలకొండపై ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రామలక్ష్మి తెలిపారు. ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75 నెట్ బ్యాంకింగ్ లేదా క్రెడిట్/డెబిట్ కార్డుల ద్వారా చెల్లించి www.cse.ap.gov.in లేదా www.apms.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఏప్రిల్ 20వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

27 నుంచి బండలాగుడు పోటీలు

కొలిమిగుండ్ల: మహాశివరాత్రి పండుగ సందర్భంగా పెట్నికోట–నాయినపల్లె గ్రామాల మధ్య వెలిసిన గుండుమల్లేశ్వరస్వామి ఆలయ క్రీడా మైదానంలో ఈనెల 27, 28 తేదీల్లో రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఎర్రబోతుల ఉదయ్‌భాస్కర్‌రెడ్డి తెలిపారు. 27న పాలపళ్ల విభాగంలో పోటీలు జరుగుతాయన్నారు. గెలుపొందిన ఎద్దుల యజమానులకు మొదటి బహుమతి రూ.30 వేలు, రెండో బహుమతి రూ.20వేలు, మూడో బహుమతి రూ. 10 వేలు అందజేస్తామని చెప్పారు. 28న నిర్వహించే యుకేటగిరి విభాగంలో విజేతలకు వరుసగా రూ.40 వేలు, రూ.30వేలు, రూ.20 వేల చొప్పున అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఎద్దుల యజమానులతో పాటు తిలకించేందుకు వచ్చే రైతులు, ప్రజలకు భోజన సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ప్యాపిలిలో..

ప్యాపిలి: మహాశివరాత్రి సందర్భంగా స్థానిక కాశీ విశ్వేశ్వరాలయం ప్రాంగణంలో ఈ నెల 27న బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి బహుమతిగా రూ. 10 వేలు, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వృషభ యజమానులకు వరుసగా రూ. 8 వేలు, రూ. 5 వేలు చొప్పున నగదు బహుమతి అందజేస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 99086 58230, 96031 06688 నంబర్లను సంప్రదించాలన్నారు.

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

బనగానపల్లె రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న ఫిజికల్ డైరెక్టర్ పోస్టుకు(గెస్ట్) దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ లలిత తెలిపారు. పీజీలో 55 శాతం, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50 శాతం మార్కులు ఉండాలన్నారు. సెట్ పీహెచ్‌డీ, బోధన అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 27వ తేదీలోపు కళాశాలలో దరఖాస్తు అందజేయాలని తెలిపారు. 28వ తేదీ అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహిస్తామని పేర్కొన్నారు.

నేడు సత్యనారాయణ వ్రతం

బనగానపల్లె రూరల్: స్థానిక బేతంచర్ల రోడ్డులోని అయ్యప్పస్వామి దేవస్థానంలో సోమవారం సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శ్రీగాయత్రి మహిళా మండలి, శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు వ్రతం జరుగుతుందన్నారు. పాల్గొనదలచిన వారు గంట ముందు రావాలన్నారు. వివరాలకు 94416 90735 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

గృహ నిర్మాణాలకు అనుమతివ్వాలని వినతి

డోన్ రూరల్: పట్టణంలోని పేరంటాలమ్మ గుడి వద్ద పేదలకు పట్టాలు ఇచ్చారని.. వాటిలో ఇంటి నిర్మాణాల కోసం అనుమతి ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.రామాంజినేయులు, జిల్లా కార్యదర్శి ఎస్.రంగనాయుడు ఆదివారం ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. వారి వెంట సీపీఐ నాయకులు పి.సుంకయ్య, మోటారాముడు, నారాయణ ఉన్నారు.

నిశ్చితార్థ వేడుకలో మాజీ ఎమ్మెల్యే



నిశ్చితార్థ వేడుకకు హాజరైన కాటసాని

కోవెలకుంట్ల: మండలంలోని అమడాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కందుల వెంకటేశ్వరరెడ్డి కుమార్తె ప్రవల్లిక, గిరిశ్వరరెడ్డి నిశ్చితార్థం ఆదివారం పట్టణంలోని వీరభద్ర పంక్షన్‌హాలులో నిర్వహించారు. బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, కాటసాని తిరుపాల్‌రెడ్డి, తదితరులు హాజరై కాబోయే వధూవరులను ఆశీర్వదించారు.

వైద్య శిబిరానికి స్పందన

సంజామల: మండల పరిధిలోని మంగపల్లె గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. పెద్దిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన డాక్టర్ పెద్దిరెడ్డి దస్తగిరి రెడ్డి ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన సుమారు 1300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పెద్దిరెడ్డి షేక్షావల్ రెడ్డి, పెద్దిరెడ్డి మౌలాల్ రెడ్డి పాల్గొన్నారు.



ఆలయ పెద్దకోనేరు నుంచి ఏర్పాటు చేసిన క్యూలైన్



ఆలయ ధ్వజస్తంభం వద్ద ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు



బసవేశ్వరుడు

ఉమామహేశ్వరుని వేడుకకు వేళాయె

- ముస్తాబవుతున్న యాగంటి ఆలయం
- రేపటి నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు
- ముమ్మర ఏర్పాట్లు చేస్తున్న అధికారులు



ఉమామహేశ్వర స్వామి



యాగంటి ఉమామహేశ్వరుని ఆలయం

బనగానపల్లె: ప్రముఖ శైవక్షేత్రం యాగంటి బ్రహ్మోత్సవాలకు సిద్ధమవుతోంది. బనగానపల్లె మండలంలోని ఎర్రమల కొండల మధ్య ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉండే ఈ క్షేత్రం ఆధ్యాత్మికభరితంగా విరాజిల్లుతోంది. ఈ నెల 25వ తేదీ నుంచి మార్చి 1వ తేదీ వరకు మహాశివరాత్రి బ్రహోత్సవాలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు వస్తుంటారు. ఉత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ప్రత్యేక క్యూలు, ఎండ నుంచి రక్షణ కోసం చలువ పందిళ్లు, వైద్య శిబిరాలు, భద్రత, వాహనాల పార్కింగ్, తాగునీటి సౌకర్యాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఆర్టీసీ సైతం ప్రత్యేక బస్సులు నడపనున్నాయి.

బ్రహ్మోత్సవాలు

ఈ నెల 25 నుంచి మార్చి 1వ తేదీ వరకు యాగంటి క్షేత్రంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. 25న మంగళవారం ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. 26న మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, కుంకుమార్చన, సహస్ర నామావళి కార్యక్రమాలు జరుగుతాయి. రాత్రి 12 గంటలకు లింగోద్భవ కాల పూజలు నిర్వహించనున్నారు. 27న నందికోల ఉత్సవం, 28న రథోత్సవం, మార్చి 1వ తేదీ రుద్రాభిషేకం, కుంకుమార్చన, 9 గంటల నుంచి శివదీక్షా విరమణ, పూర్ణాహుతి, నాగవల్లి, వసంతోత్సవం, తెప్పోత్సవం కార్యక్రమాలతో శివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

ఆలయ చరిత్ర

ఇక్కడి ఉమామహేశ్వర స్వామి స్వయంభువు. స్వామివారు శిలగా దర్శనమిస్తాడు. తూర్పు చాళుక్యుల కాలంలో గర్భగుడిని, ఆలయ రాజగోపురాన్ని హరిహర బుక్కరాయల కాలంలో నిర్మించినట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. యాగంటి క్షేత్రంలో కాకులు కనిపించవు. దీని వెనుక ఒక పౌరాణిక కథ ఉంది. ఎర్రమలలోని ఓ గుహలో అగస్త్య మునీశ్వరుడు తపస్సు చేసేవాడు. ఆయనకు తపోభంగం చేసేందుకు కాకాసురుడు అనే రాక్షసుడు వేలాది కాకులను పంపించాడు. ఇది గమనించిన అగస్త్యుడు యాగంటి పరిసర ప్రాంతాల్లో కాకులు సంచరించకూడదని శపించాడు. ఆ కారణం వల్లే ఈ క్షేత్ర పరిధిలో కాకులు కనిపించవని అంటారు. ఉమామహేశ్వరున్ని దర్శించుకుంటే శనిదోషం తొలగిపోతుందని భక్తుల నమ్మకం. ఇక్కడి సహజ సిద్ధమైన గుహలు చూపరులకు ఆహ్లాదాన్ని కలిగిస్తుంటాయి. ఇక్కడ కొండల నుంచి సజీవ నీటి ధారలు అబ్బురపరుస్తుంటాయి. ఈ నీరు చిన్న కోనేరు నుంచి పెద్ద కోనేరులోకి ప్రవహిస్తుంటుంది. పెద్ద కొనేరులో భక్తులు స్నానమాచరిస్తారు. ప్రధాన ఆలయంలోని ముఖమండపం ఈశాన్యభాగంలో ఉన్న బసవేశ్వరుడు అంతకంతకు పెరుగుతాడని భక్తుల విశ్వాసం. సుమారు 15 అడుగుల పొడవు, 10 అడుగుల వెడల్పు, 8 అడుగుల ఎత్తు కలిగి ఉంటుంది. నాలుగు స్తంభాల మధ్య ఉన్న నందీశ్వరుడిని సుమారు 90 ఏళ్ల క్రితం వరకు ప్రదక్షిణలు చేసేవారని.. ప్రస్తుతం స్తంభాలను ఆనుకొని పెరగడం వల్ల ప్రదక్షిణలకు వీలు లేకుండా ఉందని స్థానికులు చెబుతున్నారు.


బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు



మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఈ నెల 25 నుంచి మార్చి 1వ తేదీ వరకు నిర్వహిస్తున్నాం. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రత్యేక క్యూలైన్లు, చలువ పందిళ్లు, తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నాం. వాహనాలు పార్కింగ్ కోసం ఏర్పాట్లు చేశాం. భక్తులు త్వరితగతిన ఉమామహేశ్వరున్ని దర్శించుకునే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

–చంద్రుడు, యాగంటి ఆలయ ఈఓ

ముచ్చట్ల మల్లికార్జునుని బ్రహ్మోత్సవాలు



ముచ్చట్ల భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయం



మల్లికార్జునస్వామి

బేతంచెర్ల: ముచ్చట్ల మల్లికార్జున స్వామి ఆలయంలో ఈ నెల 26వ తేదీ నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు జరగనున్నాయి. 26న మహాశివరాత్రి, 27న స్వామివారి కల్యాణం, 28న రథోత్సవం, మార్చి1న వసంతోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ మద్దిలేటి తెలిపారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. బేతంచెర్లకు 5 కిలో మీటర్ల దూరంలో హెచ్‌కొట్టాల గ్రామ సమీపంలో ఈ ఆలయం ఉంది. కొండల మధ్య ఆకట్టుకునే విధంగా ఉంటుంది ఆలయం.

ఆలయ చరిత్ర

భోళా శంకరుడిగా రాక్షసులకు అడిగిందే తడువుగా వరాలు ఇస్తున్న పరమేశ్వరుడిని ప్రసన్నం చేసుకోవాలని దేవతలు భావించారు. ఈ క్రమంలో ముక్కోటి దేవతలు ముచ్చటపడి శివలింగం ప్రతిష్ఠించడంతో ముచ్చట్ల మల్లికార్జునస్వామి పేరు వచ్చినట్లు భక్తుల నమ్మకం. ఇక్కడి శివలింగాన్ని అగస్త్య మహాముని ప్రతిష్ఠించగా జనమేజయుడు ఆలయాన్ని నిర్మించినట్లు మరో కథ కూడా ప్రచారంలో ఉంది. గాలి గోపురం శ్రీకృష్ణ దేవరాయలు నిర్మించినట్లు రాతి శాసనాల ద్వారా తెలుస్తోంది. కాగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఆలయ అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. 2022లో రూ.3 కోట్ల నిధులతో రోడ్డు వేయడంతో భక్తులకు సౌకర్యంగా ఉంది.

ముస్తాబవుతున్న శివాలయాలు

బేతంచెర్ల మండలంలోని శివాలయాలు మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబవుతున్నాయి. యంబాయి గ్రామంలో వెలసిన నీలకంఠేశ్వరస్వామి, భోగేశ్వరస్వామి, సిమెంట్‌నగర్‌లోని జీవబుగ్గ లింగేశ్వరస్వామి, బైనపల్లె, రహిమానుపురం, ముసలాయిచెర్వు, ఆర్‌ఎస్ రంగాపురం గ్రామాల్లోని కాశీ విశాలక్ష్మి, విశ్వేశ్వరస్వామి ఆలయాల్లో ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు.

తిరునాలలో కాయ్ రాజా కాయ్



తిరునాలలో నిర్వహిస్తున్న జూదం

ప్యాపిలి: స్థానిక వెంకటరెడ్డి తిరునాలలో ఆదివారం జూదం జోరుగా నిర్వహించారు. కాయ్ రాజా కాయ్ అంటూ జూదం నిర్వాహకులు బహిరంగంగానే ఆటను నిర్వహించారు. పిల్లల నుంచి పెద్దల వరకు పాల్గొని జేబులు ఖాళీ చేసుకున్నారు. నిర్వాహకులు మాత్రం వేలాది రూపాయలను తమ జేబుల్లో నింపుకున్నారు. నియంత్రించాల్సిన పోలీసులు అటువైపు కన్నెత్తి చూడలేదన్న విమర్శలు వినిపించాయి.

కోర్టు ఆదేశంతో సామాజిక సేవ



ప్లకార్డులు పట్టుకొని అవగాహన కల్పిస్తున్న నిందితులు

కొలిమిగుండ్ల: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో న్యూసెన్స్ కేసు నమోదైన వారికి బనగానపల్లె కోర్టు వారం రోజుల పాటు సామాజిక సేవ కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఉత్తర్వుల మేరకు ఆదివారం ప్లకార్డులు పట్టుకొని కొలిమిగుండ్ల మసీదు సమీపంలోని రహదారిపై వాహనదారులకు అవగాహన కల్పించారు. మద్యం సేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు డ్రైవింగ్ చేయరాదని సూచిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. కొలిమిగుండ్ల పోలీస్ స్టేషన్‌లో ఇటీవలే కొలిమిగుండ్ల, పెట్నికోట, అనంతపురం జిల్లా సద్దలదిన్నెకు చెందిన ఐదుగురు గొడవ పడ్డారు. దీంతో పోలీసులు న్యూసెన్స్ కేసు నమోదు చేశారు. బనగానపల్లె కోర్టులో హాజరుపర్చగా వారికి వారం పాటు సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసిందని సీఐ రమేష్‌బాబు తెలిపారు.

ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన కార్యవర్గం

కోవెలకుంట్ల: స్థానిక ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ప్రభుత్వ నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం కోవెలకుంట్ల తాలుకా నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గోవిందు అధ్యక్షతన ఈ ఎన్నిక నిర్వహించగా ఏపీఎన్‌జీఓ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు గువ్వల రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సంఘం తాలుకా అధ్యక్షుడిగా స్థానిక ఆర్‌అండ్‌బీ కార్యాలయ అటెండర్ ఎస్‌ఎండీ ఉసేన్, ఉపాధ్యక్షులుగా భీమునిపాడు పశు సంవర్ధకశాఖ, కోవెలకుంట్ల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అటెండర్లుగా పనిచేస్తున్న వెంకటేశ్వర్లు, షబాషా, కార్యదర్శిగా తహసీల్దార్ కార్యాలయ అటెండర్ మద్దిలేటి, సంయుక్త కార్యదర్శులుగా ప్రభాకర్, పెద్ద ఓబులేసు, కోశాధికారిగా ఖాజా ఉసేన్, ఈసీ మెంబర్‌గా సుధీర్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పాఠశాలకు రేకుల వరండా ఏర్పాటు



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

అవుకు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వవిద్యార్థులు పాఠశాల ప్రధాన గేట్ వద్ద రేకులతో కూడిన వరండాను నిర్మించారు. ప్రేయర్ సమయంలో ఉపాధ్యాయులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి 1991–1992 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు రూ.1.10 లక్షలతో వరండాను నిర్మించి, అప్పటి ఉపాధ్యాయులతో ఆదివారం ప్రారంభోత్సవం చేశారు. పాఠశాలపై ఉన్న అభిమానంతో మంచి పని చేశారని పూర్వ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో బాలరాజు, మధు, శ్రీనివాసులు, లక్ష్మీకాంత్ రెడ్డి, హరినవ్యానాయక్, వేణుగోపాల్ రెడ్డి, జయభారత్ రెడ్డి, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వెంకటరెడ్డి తిరునాల



జనంతో కిక్కిరిసిన తిరునాల ప్రాంగణం

ప్యాపిలి: పట్టణంలో నిర్వహించిన వెంకటరెడ్డి తిరునాల ఘనంగా ముగిసింది. శనివారం ప్రారంభమైన తిరునాల్లో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం వివిధ గ్రామాల నుంచి వచ్చిన జనంతో తిరునాల ప్రాంగణం కిటకిటలాడింది. ఉయ్యాలలు, జెయింట్ వీల్, బ్రేక్‌డాన్స్ వద్ద చిన్నపిల్లలు, యువతతో సందడి నెలకొంది. దుకాణాలన్నీ కిటకిటలాడాయి. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

వ్యవసాయానికి ఈవారం విద్యుత్ వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ అనంతరావు తెలిపారు. కోవెలకుంట్ల, కలుగొట్ల, కొప్పెర్ల ఫీడర్ల పరిధిలోని భీమునిపాడు, అమడాల, గుంజలపాడు,జోళదరాశి, కలుగొట్ల, అల్లూరు, కొత్తపల్లె గ్రామాలకు సంబంధించి ఉదయం 7.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు. గుళ్లదూర్తి, పొట్టిపాడు, హరివరం, రేవనూరు, లింగాల, గుండుపాపల గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వర కు విద్యుత్ సరఫరా ఉంటుందని పేర్కొన్నారు.

సంజామలలో విద్యుత్ వేళలు

సంజామల: మండలంలోని సంజామల, ఆకుమల్ల, పేరుసోముల, నొస్సం సబ్‌స్టేషన్ల పరిధిలో ఈ వారం వ్యవసాయానికి ఉదయం 7:30 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఏఈ మధుసూదన్ యాదవ్ తెలిపారు. ముక్కమల్ల, ఆల్వకొండ, రెడ్డిపల్లె, వసంతాపురం, కమలపురి, ముదిగేడు, కానాల, అక్కంపల్లె, గిద్దలూరు, ఆర్.లింగందిన్నె, రామిరెడ్డిపల్లె, మిక్కినేనిపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాల్లో పగటి పూట 9 గంటల విద్యుత్ సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్యాపిలి: అనంతపురం జిల్లా గుత్తి సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్న కారణంగా సోమవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ వినయ్ కుమార్ ఆదివారం తెలిపారు. ప్యాపిలి, పోతుదొడ్డి, పెద్దపొదిళ్ల సబ్‌స్టేషన్ల పరిధిలోని అన్ని గ్రామాల్లో సోమవారం ఉదయం 7:30 నుంచి 9:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఉదయం 9:30 గంటల నుంచి వ్యవసాయ విద్యుత్ సరఫరా చేస్తామన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న సేవ సంస్థ సభ్యులు

డోన్: ద్రోణాచలం స్వచ్ఛంద సేవా సంస్థ ఆత్మబంధువు బృందం అనాథ శవానికి అంత్యక్రియలు చేసింది. డోన్ రైల్వేస్టేషన్ టికెట్ బుకింగ్ కౌంటర్ వద్ద గుర్తుతెలియని అనాథ వృద్ధుడు(సుమారు 70 ఏళ్లు) మృతిచెందాడు. అంత్యక్రియలు నిర్వహించాలని పోలీసులు సమాచారం ఇవ్వగా టీం సభ్యులు గురుస్వామి, తాహేర్ బాషా, సయ్యద్ వలి, శివారెడ్డి స్పందించి అంత్యక్రియలకు ఏర్పాట్లు పూర్తిచేశారని వ్యవస్థాపక అధ్యక్షుడు షాదిఖాన రాజు తెలిపారు. అంత్యక్రియల ఖర్చును ప్రొద్దుటూరుకు చెందిన చరణ్‌తేజారెడ్డి, డోన్‌కు చెందిన రాజయ్యగౌడ్ భరించారన్నారు.

వివాహ వేడుకల్లో మాజీ మంత్రి బుగ్గన



బుగ్గన రాజేశ్వరరెడ్డి కుమారుని వివాహానికి హాజరైన మాజీ మంత్రి బుగ్గన

డోన్/ప్యాపిలి: మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఆదివారం డోన్ నియోజకవర్గంలో జరిగిన పలు వివాహాలకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. పట్టణంలోని సాయి ఫంక్షన్ హాల్‌లో వైఎస్సార్‌సీపీ నాయకుడు బుగ్గన రాజేశ్వరరెడ్డి, మహాలక్ష్మి దంపతుల కుమారుడు అమర్నాథ్‌రెడ్డి, లక్ష్మి వేదశ్రీల వివాహానికి, అలాగే జగదుర్తి మోహన్‌రెడ్డి, అనసూయల కుమారుడు విద్యాధర్‌రెడ్డి, లతా మాధవి వివాహం, ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఈశ్వర్‌రావ్ కుమార్తె వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, వైస్‌చైర్మన్ జాకీర్‌హుసేన్, మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, నాయకులు సోమేష్‌యాదవ్, మల్లికార్జునరెడ్డి, పోస్టుప్రసాద్, రాజవర్దన్ ఉన్నారు. అలాగే ప్యాపిలి మండలం బావిపల్లి, మామిళ్లపల్లి గ్రామాల్లో జరిగిన వివాహ వేడుకల్లో పాల్గొన్నారు. పెద్దపొదిళ్లలో మాజీ సర్పంచ్ సుధాకర్, సర్పంచ్ ఉషారాణి కుటుంబాలను పరామర్శించారు.

నేడు గుడిపాడుకు మాజీ మంత్రి

మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి సోమవారం ఉదయం 9 గంటలకు గుడిపాడు గ్రామానికి రానున్నట్లు వైఎస్సార్‌సీపీ కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలన్నారు.

ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

డోన్ టౌన్: డోన్ ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం మూడేళ్ల కాలపరిమితితో నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. స్థానిక అమ్మవారిశాలలో ఈ కార్యక్రమం జరిగింది. సంఘం అధ్యక్షుడిగా మున్సిపల్ వైస్ చైర్మన్ కొట్రికె హరికిషన్, ఉపాధ్యక్షులుగా కొట్రికె ఫణిరాజ్, జొన్నలగడ్డ శ్రీనివాసులు, కార్యదర్శిగా రంగయ్య, కోశాధికారిగా రజనీలను ఎన్నుకున్నారు. అలాగే యువజన సంఘం అధ్యక్షుడిగా కామిశెట్టి విద్యాసాగర్, కార్యదర్శిగా రాజా ప్రదీప్, కోశాధికారిగా సముద్రాల విజయ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం అందరి సమక్షంలో ప్రమాణ స్వీకారం చేయించారు. సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన డెస్కులు

బనగానపల్లె రూరల్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మార్చి 1వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రిన్సిపల్ రాజిక సత్యప్రపూర్ణ తెలిపారు. కళాశాల పరీక్ష కేంద్రంలో మొత్తం 249 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు చెప్పారు. పరీక్షలు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉంటుందని, విద్యార్థులు ఉదయం 9 గంటలకే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. అన్ని పరీక్ష గదుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. తాగునీటి సౌకర్యం, విద్యుత్ తదితర అన్ని వసతులు కల్పించినట్లు తెలిపారు. పరీక్షలు మార్చి 20వ తేదీతో ముగుస్తాయని, పరీక్ష కేంద్రం చీఫ్ ఆఫీసర్‌గా ఆనందరావు, డీపార్ట్‌మెంట్ ఆఫీసర్‌గా బాలఓబన్నను ఉన్నతాధికారులు నియమించినట్లు పేర్కొన్నారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి



మాట్లాడుతున్న ఎంపీఆర్పీఎస్ నాయకులు

ప్యాపిలి: వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఎంపీఆర్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగరాజు, యూత్ ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆదివారం ప్యాపిలిలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. అసెంబ్లీ, పార్లమెంటు సమావేశాల్లో ఎస్టీ జాబితాలో చేర్చడానికి తీర్మానాలు చేయాలని కోరారు. సమావేశంలో సంఘం నాయకులు రంగయ్య, రామాంజనేయులు, ప్రతాప్, నగరినాయుడు, పెద్దయ్య, అగ్గి మద్దయ్య, గిరి, వెంకట్, వెంకటరాముడు, సుమన్, తిమ్మరాజు తదితరులు పాల్గొన్నారు.